ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శుక్రవారం 25 జూలై 2025

నేటి నుంచి శ్రావణం

● పండుగలు, పూజలు, వ్రతాలు



సుల్తానాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం అవుతుంది. ఈ మాసంలో పూజలు, వ్రతాలు ఆచరిస్తారు. లక్ష్మీ, గౌరీ దేవి అమ్మ వారలకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. ఈ నెలలో పలు పండుగలు వస్తాయి. శ్రావణ మాసం పూర్తిగా ఆధ్యాత్మికతతో నిండి ఉంటుంది. ఉపవాసాలు, ఇండ్లలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఈ మాసంలో ప్రతీ శుక్రవారం మహిళలు పండగలా భావిస్తారు. పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను ఆచరిస్తారు. మరో ముఖ్యమైన పండగ రాఖీ పండుగ. ఈ నెల 9 శనివారం ఉంది. సోదర సోదరీమణుల ఆప్యాయతలకు గుర్తుగా నిలుస్తుంది. జంధ్యాల పౌర్ణమి కూడా జరుపుకుంటారు. స్మార్తలకు సంబంధించి శ్రీకృష్ణ జన్మాష్టమి 16వ తేదీన జరుపుకోనున్నారు. ఈ శ్రావణ మాసం శుభకార్యాలు కూడా అధికంగా జరుపుకుంటారు. పెళ్ళిళ్ల, గృహ ప్రవేశాలకు, నూతన వృత్తి వ్యాపారాల ఆరంభానికి అనుకూలమైన మాసంగా పరిగణిస్తారు.

ఈనెల 27న ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

మంథని, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మంథని నుంచి ఈనెల 27న తమ సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు టూర్ ప్యాకేజీ బస్సు నడిపిస్తున్నట్లు డీఎం శ్రావణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈనెల 27న మేడారం సమ్మక్క-సారక్క, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి, రామప్ప టెంపుల్, లక్నవరం ప్యాకేజీ టూర్‌తో బస్సు బయలుదేరుతుందని తెలిపారు. బస్సు ఉదయం 6 గంటలకు వెళ్ళి రాత్రి 8 గంటలకు తిరిగి మంథనికి చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.8 వందలు, పిల్లలకు రూ.5 వందలు టిక్కెట్ చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు.

వర్షాలతో ఊరట

- ఇప్పుడిప్పుడే కురుస్తున్న వానలు
- సకాలంలో కురవక సాగు ఆలస్యం
- ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి స్వల్పంగా వరద
- సాధారణానికి చేరని వర్షపాతం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురుస్తుండడంతో పంటలు సాగు ముందుకు సాగడం లేదు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులకు కొంత ఊరట కలిగినప్పటికీ నీటి వనరులైన ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండే స్థాయిలో భారీ వర్షాలు కుర వడం లేదు. ఈ సీజన్‌లో జిల్లాలో ఈ నెల 23న రాత్రి కురిసిన భారీ వర్షమే అత్యధికం. జిల్లా వ్యాప్తంగా 53.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మరిన్ని భారీ వర్షాలు కురిస్తేనే ఈ సీజన్‌లో వ్యవసాయ శాఖా ధికారులు అంచనా వేసిన మేరకు పంటలు సాగు కాను న్నాయి. జిల్లా రైతులు ప్రధానంగా శ్రీరాంసాగర్ ప్రా జెక్టు నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. డి-83, డి-86 కాలువల ద్వారా జిల్లా వ్యాప్తంగా 1,73,000 ఎకరాల్లో పంటలు సాగవుతాయి. జిల్లాలో వానాకాలం సీజన్‌లో అత్యధికంగా వరితోపాటు పత్తి పంటలు, యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న, తది తర పంటలను సాగు చేస్తారు. వానాకాలం సీజన్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి, వ్యవసాయ బావులు, బోరు బావులు, చెరువులు, కుంటల కింద 2,76,076 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయనున్నారని అంచనా వేశారు. గత ఏడాది వానాకాలంలో 2,72,678 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది అదనంగా 3,368 ఎకరాల్లో సాగు పెరగనున్నట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లాలో అత్యధికంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలనే సాగు చేస్తున్నారు. వానాకాలంలో 2,12,500 ఎకరాల్లో వరి, 705 ఎకరాల్లో మొక్కజొన్న, 5 ఎకరాల్లో పెసర, 5 ఎకరాల్లో మినుము, 250 ఎకరాల్లో కంది, 10 ఎకరాల్లో వేరుశెనగ, 5 ఎకరాల్లో నువ్వులు, 52,500 ఎకరాల్లో

(మిగతా 8వపేజీలో)

● లోటు వర్షపాతం..

జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. 374.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపా తానికి గాను 271.9 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయ్యింది. ఇంకా 27 శాతం లోటు ఉంది. ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్ మండలాల్లోనే సాధారణ వర్షపాతం నమోదయ్యింది. ధర్మారం, పాలకుర్తి, అంతర్గాం, రామగుండం, రామగిరి, కమాన్‌పూర్, పెద్దపల్లి, జూలపల్లి, ఎలిగేడు, మంథని మండలాల్లో ఇంకా సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉద యం వరకు జిల్లాలో 25.5 మిల్లీమీటర్ల సగటు వర్షపా తం నమో దయ్యింది. ఈ వర్షాలతో వాగులు పారుతు న్నప్ప టికీ, చెరువులు, కుంటలు మత్తడులు దూకడం లేదు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

● నేర సమీక్ష సవేశంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు, మాట్లాడుతున్న సీపీ

కోల్‌సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల, నేరాల నియంత్రణ విషయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో సీపీ గురువారం కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సీపీ ముందుగా పోలీస్ స్టేషన్, డివిజన్, జోన్లవారిగా పెండింగ్ కేసుల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆరు నెలల కాలంలో జరిగిన తప్పిదాలు, భవిష్యత్తు లో కేసుల పరిష్కారానికి తీసుకునే చర్యలపై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం సైబర్ క్రైమ్ అనేది ఒక పెద్ద సమస్యగా మారిందని, దీనిపై శ్రద్ధ పెట్టాలన్నారు. కేసుల దర్యాప్తులో విషయంలో అధికారులు టెక్నాలజీతో పాటు, శాస్త్రీయ పద్ధతి అనుసరిస్తూ దర్యాప్తు చేపట్టాలని, ఏదైనా సంఘటన జరిగినప్పుడు వీడియోగ్రాఫీ తప్పక చేయించాలన్నారు. కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయడంతో పాటు, నిందితులకు శిక్షలు పడేవిధంగా సాక్ష్యాధారాలను కోర్టుకు అందజే యాలన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని స్టేషన్ అధికారులు తమ పరిధిలోని గ్రామాలను సందర్శించి సమాచారాన్ని సేకరించాలని, ప్రతి గ్రామంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించడంతో పాటు వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు గల కారణాలపై విశ్లేషణ చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని, శాఖ పరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, కమిషనరేట్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఎస్‌ఐలు, వివిధ వింగ్స్ ఇన్‌స్పెక్టర్లు, సీసీ హరీష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెంచేలా కృషి చేయాలి



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలపై కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా గురువారం పెద్దపల్లి సుభాష్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదివింది అర్థం చేసుకునే సామర్థ్యం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన టీఎల్ఎంను ఉపాధ్యాయులు ఉపయోగిస్తున్న బోధనోపకరణాలు, సామగ్రిని తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. గుణాత్మకమైన బోధనపై దృష్టి సారించి మంచి ఫలితాలను సాధిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలని, వసతులు సమకూర్చాలని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారిని ఆదేశించారు. తహసీల్దార్ రాజయ్య, ఏఎంఓ షేక్, హెడ్ మాస్టర్ మనోహర్ రావు తదితర అధికారులు ఉన్నారు.

సర్వేయర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పెద్దపల్లి కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరగనున్న జీపీఓ సర్వేయర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం నిర్వహించిన జీపీఓ, లైసెన్స్ సర్వేయర్ పరీక్షలపై అదనపు కలెక్టర్ వేణుతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రామగిరి జెఎన్టీయూలో జరిగే పరీక్ష కేంద్రానికి ఎస్కార్ట్‌తో తరలించాలన్నారు. ఆదివారం థియరీ పరీక్ష ఉంటుందని, అనంతరం వాటిని హైదరాబాద్‌కు తరలించాల్సి ఉంటుందన్నారు. అలాగే మంగళ, బుధవారాలు ఫీల్డ్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. జిల్లాలో 29 మంది అభ్యర్థులు రాయనున్నారని, వారికి అన్ని రకాల ఏర్పాట్లు సిద్ధం చేయాలని తెలిపారు.

రైతులకు అందుబాటులో యూరియా

ఎలిగేడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రైతులకు సహకార సంఘాల్లో సరిపడ యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సహకార సంఘాలు, పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మాట్లాడుతూ రైతులు పంట కాలానికి అవసరం మేరకు యూరియాను కొనుగోలు చేయాలని, అదనంగా కొనుగోలు చేసి నష్ట పోవద్దన్నారు. అలాగే యూరియాకు బదులుగా నానో యూరియాను వాడాలని తెలిపారు. మండలంలోని సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల్లో 4200 బస్తాల వరకు యూరియా నిల్వలు ఉంటున్నట్లు వారు తెలిపారు.

ఆదర్శ పాఠశాలను సందర్శించిన డీఈవో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో మాధవి

ధర్మారం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు విద్యాబ్యాసంలో నూతన ఒరవడి అవలంభిస్తున్నారని డీఈవో మదవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను సందర్శించి క్లాస్ రూం అబ్జర్వేషన్, టీచింగ్ డైరీ, లెసన్ ప్లాన్, పీరియడ్ ప్లాంట్స్, బేస్ లైన్ టెస్టుకు సంబంధించిన డైరీలను తనిఖీ చేశారు. కళాశాలలో అనుసరిస్తున్న ఎఫ్ఎం రేడియో, మంత్లీ మాగ్జీన్ గురించి డీఈఓకు వివరించగా ఈ కార్యక్రమాల నిర్వహణపై ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌ను అభినందించారు.

గురుకులాలాల్లో స్టీల్ పాత్రలు

- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి
- మల్లాపూర్ గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి

సుల్తానాబాద్‌లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

- డ్రైనేజీల్లో పూడిక తీత పనులు
- రోజూ వార్డుల్లో అవగాహన సదస్సులు

సుల్తానాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీలో పారిశ్యుంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. సీజనల్ వ్యాధుల ముప్పు ప్రబలకుండా ఉండేందుకు నెల రోజుల ముందు నుంచే ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీలో పదిహేను వార్డులు ఉండగా ఇరవై వేలకు పైగా జనాభా ఉంది. మున్సిపాలిటీలో సుగ్లాంపల్లి, శ్రీరాములపల్లి, పూసాల, శాస్త్రినగర్ తదతర విలీన గ్రామాలున్నాయి. పట్టణంలోని డ్రేనేజీ వ్యవస్థ సరిగా లేక అంతరాయం ఏర్పడుతోంది. కలెక్టర్ కోయ శ్రీహర్ష మున్సిపాలిటీని సందర్శించి పారిశుధ్యంపై సమీక్షించారు. కొన్ని రోజుల నుంచి పారిశుధ్య పనులు ఊపందుకున్నాయి, సుల్తానాబాద్ పలు మండలాలకు కూడలిగా ఉండడంతో పాటు విస్తరించిన పరిశ్రమలతో వందలాది మంది ఇక్కడ స్థిరపడుతున్నారు. ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అనేక వ్యాపారాలు ఉద్యోగాలు నిర్వహిస్తు న్నారు. దాంతో పట్టణ జనాభా వేగంగా పెరుగు తోంది. డ్రైనేజీల వ్యవస్థ బాగా లేకపోవడంతో ఎక్కడకక్కడే నీరు రోడ్ల పై నుంచి పారుతుంది. వర్షాకాలంలో ఇదీ మరీ ఎక్కువగా ఉంటుంది. దోమలకు నిలయంగా మారుతున్నాయి. పలు కాలనీల్లో నిలిచి ఉన్న నీటిలో దోమలు పెరిగి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.



డ్రైనేజీలో పూడిక తీసే పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్

● నాలాలు ఆక్రమణ

పట్టణంలోని పలు ప్రధాన నాలాలు ఆక్రమణలకు గురయ్యాయి. వాటి ఫలితంగానే ఒకప్పటి డ్రైనేజీ, వరద నీటి కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొందరు నేతలు నాలాలపై నిర్మాణాలు ప్రోత్సహించారు. ప్రతీ వర్షాకాలంలో వరద నీరు రోడ్లపై ఇండ్లలోకి వచ్చి చేరుతుంది. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణలకు గురైన నాలాలను సరి చేసి వరద నీరు సవ్యంగా పోయేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● ప్రత్యేక కార్యాచరణకు దిగిన మున్సిపల్ అధికారులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్న కలెక్టర్ ఆదే శాలతో రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు ముందుగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. రోజు ఒకటి రెండు వార్డులు ఎంచుకుని డ్రైనేజీ లను శుభ్రం చేయిస్తున్నారు. ఎక్స్‌కా వేటర్‌తో పనులు చేయిస్తున్నారు. ఎక్కడా మురుగు నీరు లేకుండా చేస్తున్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి మున్సిపాలిటీలో వంద రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం జరుగుతుంది. ప్రజలను సమావేశ పరిచి పొడి, తడి చెత్త పట్ల అవగాహన కల్పిస్తున్నారు. దానికి తోడు చెత్తను బయట పడవేయవద్దని సూచిస్తున్నారు.



డ్రైనేజీలో నీరు తొలగిస్తున్న కార్మికుడు

డ్రైనేజీల మరమ్మతు చేపట్టాం
- కమిషనర్ తిప్పరాజు రమేష్



సుల్తానాబాద్ పట్టణంలో 24 సమస్యాత్మకమైన డ్రైనేజీలను గుర్తించాం. వీటిలో ఎక్స్‌కావేటర్‌తో పూడికలు తీయించి మురుగు తీయిస్తున్నాం. దోమలు ప్రబలకుండా ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. దోమల నివారణకు మున్సిపాలిటీలో ఒకటే ఫాగింగ్ యంత్రం ఉంది. పరిశుభ్రత విషయంలో స్వచ్ఛకాలనీలుగా ఉండేలా చేస్తున్న పనులకు ప్రజలు సహకరించాలి.

వార్డెన్ నిర్లక్ష్యంపై విద్యార్థుల రాస్తారోకో



హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి వినోద్‌కుమార్

మంథని, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలేజ్ స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్ వార్డెన్ సాదుల రమేష్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, టిఫిన్, భోజనం విషయంలో ఇబ్బందులకు గురి చేయటాన్ని నిరసిస్తూ విద్యార్థులు అంబేద్కర్ చౌక్‌లో గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి వార్డెన్, ఎఎస్‌డబ్ల్యూవోలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విమరించారు. జిల్లా సంక్షేమాధికారి వినోద్‌కుమార్ హాస్టల్ తనిఖీ చేశారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. సమస్యలపై కలెక్టర్, కమిషనర్‌లకు నివేదిస్తానని తెలిపారు.

వృథాగా పోతున్న కల్వల ప్రాజెక్టు నీరు



కట్ట తెగి వృథాగా పోతున్న కల్వల ప్రాజెక్టులోని నీరు

శంకరపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వల ప్రాజెక్టు నీరు దిగువకు వృథాగా పోతోంది. రెండు సంవత్సరాల క్రితం ప్రాజెక్టుకు మత్తడి వద్ద గండిపడింది. అప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేశారు. కాగా గతవర్షాకాలంలో అదేచోట మళ్లీ గండిప డింది. ప్రభుత్వం ఎలాంటి మరమ్మతు చేపట్టకపోవడంతో రైతులే గండికి కొంతదూరంలో తాత్కాలి కంగా మరమ్మతులు చేసుకున్నారు. రెండ్రోజులనుంచి కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి పెరగడంతో రైతులు నిర్మించిన తాత్కాలిక కట్ట తెగి నీరు దిగువకు వృథాగా పోతోంది.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

జూలపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికిచెందిన జుట్టు అంజయ్య(35) అనే దివ్యాంగుడు భార్య కాపురానికి రావడంలేదని బావిలోదూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అంజయ్యకు ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామానికి చెందిన శ్రీకొండ జ్యోతితో పదేళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మూడునెలల క్రితం దంపతుల మధ్య గొడవలు జరిగాయి. అంజయ్య భార్య జ్యోతి పిల్లలను తీసుకుని తల్లిగారి ఇంటికి వెళ్ళింది. అప్పటి నుంచి భార్య కాపురానికి రాకపోవడంతో ఆవేదన చెందేవాడని అంజయ్య తండ్రి వెంక టయ్య పేర్కొన్నాడు. భార్య కాపురానికి రాదేమోననే బెంగతో రెండు రోజుల క్రితం నుంచి కనిపించక పోయాడని, ఎక్కడ వెతికిన ఆచూకీ దొరకలేద న్నారు. గురువారం గ్రామశివారులోని బావిలో అంజయ్య మృతిచెంది ఉండగా గుర్తించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందిం చారు. అంజయ్య బావిలోదూకి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

వ్యాన్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ఇల్లంతకుంట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపెల్లి గ్రామ సమీపంలో డీసీఎం వ్యాన్ గురువారం బోల్తాపడగా డ్రైవర్ అజీజ్ గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నేరువరం మండ లం వడ్లూర్ గ్రామానికి చెందిన అజీజ్ వాహనం నడపుకుంటూ వస్తుండ గా తాళ్ళపెల్లి, గూడెం గ్రామాల మధ రోడ్డు పూర్తిగా చెడిపోవడంతో అదపు తప్పి వాహనం బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ గాయపడగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

చొప్పదండి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్ శివా రులో జరిగిన రోడ్డుప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. గుమ్లాపూర్ గ్రామానికిచెందిన గడుగు లచ్చయ్య, అంజలి వ్యవసాయపనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి తిరిగివెళ్తున్నారు. ఈ క్రమంలో వారిని కారు ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం దంపతులిద్దరిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

గంభీరావుపేట, జులై 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో గురువారం మహన్సీ అనే మూడేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. ఇంటి ఎదుట ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేయడంతో బాలుడి తల వెనుకభాగంలో తీవ్రగాయాలు అయ్యాయి. ముందుగా సిరిసిల్ల ఆసుపత్రికి, అక్కడినుంచి కరీంనగర్‌కు బాలుడిని చికిత్స కోసం తరలించారు.

బొమ్మనపల్లిలో మూడు ఇళ్లలో చోరీ



క్లూస్‌టీంతో పరిశీలిస్తున్న ఎస్సై సాయికృష్ణ, సిబ్బంది

చిగురుమామిడి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మన పల్లిలో బుధవారం రాత్రి, గురువారం ఉద యం మూడు ఇళ్లలో చోరీ జరిగిందని ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివ రాలిలా ఉన్నాయి. కన పర్తి రవీంద్రచారి గోల్డ్ స్మిత్ షాపులో 4తులాల బంగారం, వెండి, ల్యాగల రాజేశ్వరి ఇంటి తాళాలు పగులకొట్టి సుమారు 2తులాల బంగారం, 30తులాల వెండి, మచమల్ల బొందయ్య ఇంటిలో 3గ్రాములు బంగారం, 30తులాల వెండిని అపహరించి నట్లు ఎస్సై తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్‌టీమ్ బృందాన్ని తీసుకు వచ్చి పరిశీలన చేశామన్నారు.

దెబ్బతిన్న కరీంనగర్-జమ్మికుంట రోడ్డు

● రాకపోకలకు అంతరాయం



మామిడాలపల్లిలో తెగిపోయిన కరీంనగర్-జమ్మికుంట రోడ్డు

వీణవంక, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని మామిడాలపల్లి గ్రామంలోని గొల్లపల్లిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాత్కలికంగా వేసిన మట్టిరోడ్డు తెగిపో యింది. దీంతో జమ్మి కుంట, కరీంనగర్‌కు మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రెండు సంవత్సరాలుగా చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులు పూర్తికాలేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా తెగిపోయింది. వాహనాలను ఇతర దారులగుండా మళ్లిస్తున్నారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా ఇన్‌ఫ్లో

● ప్రాజెక్టులోకి 2,579 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు రావడం కొనసాగుతోంది. డ్యామ్‌లోకి 2,579 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరినీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5టీఎంసీల సామర్థ్యంకుగానూ ప్రస్తుతం 21.369 టీఎంసీ ల నీరు నిల్వఉంది. గతయేడాది ఇదేసమయానికి ప్రాజెక్టులో 24.376 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డ్యామ్



గతంలో కంకర తేలిన మంగళపల్లి రోడ్డు



సుద్దాల ఎక్స్‌రోడ్డు నుంచి మంగళపల్లి వరకు నిర్మిస్తున్న తారు రోడ్డు

దశాబ్దాల నిరీక్షణకు మోక్షం

● నెరవేరిన మంగళపల్లి చిరకాల వాంఛ ● పూర్తికావస్తున్న తారు రోడ్డు నిర్మాణం

కోనరావుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల నిరీక్షణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కోనరావుపేట మండలంలోని మంగళపల్లి ఓ చిన్న గ్రామం. ఇక్కడ 130 కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తాయి. పూల తోటలు, కూరగాయలు, మొక్కజొన్న, మిర్చి, పత్తి సాగు చేస్తారు. పంట దిగుబడులను పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తుం టారు. గ్రామం నుంచి రోడ్డు రాళ్లు తేలి గుంతల మయంగా మారడంతో 30 సంవత్సరాలుగా ఇబ్బందులు పడ్డారు. సుద్దాల ఎక్స్‌రోడ్డు నుంచి మంగళపల్లి వరకు కిలోమీటర్‌నర ప్రధాన రోడ్డు ఉంటుంది. గతంలో వేసిన కంకర తేలి రాళ్లతో గుంతలమయంగా మారింది. రోడ్డు బాగు చేయాలని గతంలో పాలకులకు గ్రామస్థులు మొరపెట్టుకున్నా ఫలితం కలగలేదు. గ్రామం నుంచి విద్యార్థులు సుద్దాల పాఠశాలకు వెళ్లడమే కాకుండా పట్టణాలకు కూడా వాహనాలపై వెళ్లి విద్యను అభ్యసిస్తారు. కంకర తేలిన రోడ్డు వెళ్లి ప్రమాదాలకు గురయ్యారు. 20 నెలల క్రితం ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ తారురోడ్డు నిర్మిస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలువగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎమ్మెల్యేగా గెలిచిన ఆది శ్రీనివాస్ ఆరు నెలల క్రితం తారు రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి కోటి 30 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో సదర్ కాంట్రాక్టర్ వేగవంతంగా తారు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించి పూర్తి దశకు చేరుకున్నాయి. త్వరలో తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయనున్నారు.

కంకర తేలిన రోడ్డుతో ఇబ్బందులు పడ్డాం..

- సాండెసారి శ్వేత, మంగళపల్లి రైతు



కంకర తేలిన రోడ్డుతో చాలా రోజులు ఇబ్బందులు పడ్డాం. ప్రతిరోజు కూరగాయలు, పూలు పట్టణాలకు తీసుకెళ్లడానికి రోడ్డు బాగు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డాం. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిధులు మంజూరుచేయడంతో తారు రోడ్డు నిర్మాణం పూర్తి అవుతోంది. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.



మంగళపల్లెలో నిర్మించిన సీసీ రోడ్డు

ఎమ్మెల్యే ప్రోత్సాహంతో నిధులు మంజూరు..

- ఎల్లయ్య, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్



కొన్ని సంవత్సరాలుగా మంగళపల్లి ప్రజలు తారు రోడ్డు లేక ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల ముందు ఆది శ్రీనివాస్ తారు రోడ్ నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయిస్తున్నారు. దీంతో గ్రామ ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది.

ప్రజల కల నెరవేరింది..

- బాదినేని బాలరాజు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు



మంగళపల్లి గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా తారు రోడ్డు లేక నరకయాతన పడ్డారు. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నిధులు మంజూరు చేయలేదు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల ముందు మాట ఇచ్చి గెలిచిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయిస్తున్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు గ్రామ ప్రజలు రుణపడి ఉంటారు.

సుపారీ ఇచ్చి భర్తను హత్య చేయించిన భార్య

● రెండేళ్ల క్రితం ఘటన ● భార్య, కూతుళ్లపై వేధింపులు తాళలేకే ఘాతుకం
● కేసులో ఆరుగురు నిందితులు.. ఒకరి మృతి
● గంజాయి కేసు విచారణలో బయటపడ్డ హత్యోదంతం
● భార్యను రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితురాలి అరెస్టు చూపుతున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

మల్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిస అయిన భర్త ఇంట్లో వస్తువులన్నింటినీ అమ్ము కుంటూ జూదం ఆడుతూ నిత్యం వేధిస్తుండడంతో తాళలేక భర్తను సుపారీ ఇచ్చి హత్య చేయించింది. ఈ ఘటన రెండేళ్లక్రితం చోటుచేసుకోగా ఇటీవల జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో గంజాయి కేసులో పట్టుబడిన వారే నాటికేసులో నిందితులుగా పోలీసులు గుర్తించారు. ఇందులో మృతుడి భార్యతో పాటు మరో అయిదుగురు నిందితులు ఉండగా ఒకరు మృతిచెందారు. గురువారం మృతుడి భార్యను పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ మల్యాల పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివ రాల ప్రకారం.. జగిత్యాలజిల్లా మెట్‌పల్లిలోని సాయి రాంనగర్ కాలనీకిచెందిన సింగం నడిపి గంగాధర్ (45)కు భార్య సంధ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గంగా ధర్ మద్యానికి బానిస అయి నిత్యం తాగుతూ ఇంట్లోని వస్తువులు అమ్మి జూదం కూడా ఆడుతూ భార్య సింగంసంధ్యను వేధిస్తుండేవాడు.

ఈ క్రమంలో కూతురుకు వివాహం చేయాలని నిర్ణయించుకోగా గంగాధర్ ఒప్పుకోకపోవడంతో సంధ్య పదివేల రూపాయలు ఇస్తా అని ఆశచూపి పెద్ద కూతురు వివాహం జరిపించింది. వివాహం అయ్యాక కూతురు అత్తగారింటికి వెళ్లి అల్లుడితో గొడవ పడుతుండడం, తనను నిత్యం వేధింపులకు గురిచేయ డంతో విసిగిపోయింది. సంధ్య ఈ విషయాన్ని తనభర్త అన్నకొడుకు సింగం గ్రాహిత్, అతని తల్లి మమతకు తెలిపింది. దీంతో గ్రాహిత్ ఓ సారి గంగాధర్‌ను మంచిగా ఉండాలని హెచ్చరించిన ప్పటికీ తీరు మార్చుకోలేదు. దీంతో తమ జీవితాలు నాశనం అవుతా యని భావించిన భార్య సంధ్య భర్తను చంపాలనే నిర్ణయానికి వచ్చింది. ఇదే విషయాన్ని గ్రాహిత్‌కు తెలిపింది. దీంతో అతను 40వేల రూపాయలు ఇస్తే హతమార్చడానికి ముగ్గురిని తీసుకువస్తానని తెలిపాడు. దీంతో సంధ్య డబ్బులు ఇవ్వడంతో మెట్‌పల్లికే చెందిన అబ్దుల్ అఫ్సర్, చెన్న నిఖిల్, పవన్‌కు సమాచారం అందించాడు. 12 మార్చి 2023న అద్దె కారులో గంగాధర్‌ను తీసుకొని సంధ్య, గ్రాహిత్, అబ్దుల్ అఫ్సర్, చెన్న నిఖిల్, పవన్, మమత కొండగట్టుకు వచ్చారు. ఓ టేకు తోట సమీపం లోకి తీసుకెళ్లి గంగాధర్‌ను మాటల్లో పెట్టి మందు తాగించారు. సంధ్య, మమత అతని కాళ్లు గట్టిగా పట్టుకోగా గ్రాహిత్, అఫ్సర్ వైర్ తీగతో మెడకు చుట్టి ఊపిరి ఆడకుండా గట్టిగా లాగారు. నిఖిల్ అనే యువకుడు ఎవరైన వస్తున్నారా అని చుట్టుపక్కల గమనించగా చనిపోయాడో లేదోఅని మరో యువకుడు పవన్ అక్కడే పడి ఉన్న పాత టీవీ పిక్చర్ ట్యూబ్ పగలగొట్టి గంగాధర్ మెడనుకోశాడు. తరువాత గంగా ధర్ మృతి చెందినట్లు గ్రాహిత్ నిర్ధారించుకున్న అనం తరం మృతదేహంపై అక్కడి చెత్త పోగుచేసి గంగాధర్ మృతదేహాన్ని తగులబెట్టి తిరిగి వెళ్లారు. గంగాధర్ గురించి ఎవరూ అడిగినా తాగుబోతు అని తమను వదిలివెళ్లిన్నట్లు భార్య సంధ్య చెబుతుండేది. అప్పట్లో మల్యాల పోలీసులు కేసు నమోదు చేశారు.

● గంజాయి కేసులో ఇరుక్కొని..

హత్య దృశ్యాల వీడియోలతో పట్టుబడి..

ఈ నెల 17న మెట్‌పల్లిలో పోలీసులు గంజాయి కేసులో గ్రాహిత్, అబ్దుల్ అఫ్సర్, చెన్న నిఖిల్‌ను అరెస్టు చేశారు. గంజాయికి సంబంధించి విచారణ జరుపుతుం డగా కొండగట్టులో గత 2023లో హత్యకు పాల్పడిన వీడియో దృశ్యాలు వారి ఫోన్‌లో లభించడంతో లోతుగా దర్యాప్తు జరుపగా తామే హత్యకు పాల్పడినట్లు తెలిపిన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. గ్రాహిత్, అబ్దుల్ అఫ్సర్, చెన్న నిఖిల్‌తో పాటు పవన్ ప్రస్తుతం జైల్‌లో ఉన్నారు. కాగ కొన్నాళ్ల క్రితం మమత మృతి చెందగా మృతుడి భార్య సంధ్యను మల్యాల పోలీసులు గురు వారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విలేక రుల సమావేశంలో డీఎస్పీతో పాటు విలేకరుల సమావేశంలో సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

● నగదు, వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ శివారులోని కోళ్లఫారంలో పేకాట ఆడుతు న్నారనే సమాచారంతో దాడిచేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకు న్నామని పేర్కొన్నారు. వారినుంచి రూ.15,280, కారు, రెండు బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనపర్చు కున్నామని, కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ధర్మారం: మండలకేంద్రంలో పేకాడు తున్న నలుగురిని గురువారం పోలీసులు అరెస్ట్‌చేశారు. గ్రామంలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఏఎస్ఐ అబ్దుల్‌జలీల్ అధ్వర్యంలో పోలీసులు దాడులుచేశారు. ఇందులో నలు గురిని పట్టుకొని వారివద్ద నుంచి 10,650 రూపాయలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.ప్రవీణ్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

ధర్మారం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మేతకువెళ్లిన మేకలకు కరెంట్‌షాక్ తగిలి ఒకమేక చనిపోగా 4మేకలు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. మండలం లోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కొమ్ము కొమురయ్యకుచెందిన మేకలను గ్రామం లోని కాట్నాల బోరుకు తోలుకుపోగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలి ఒక మేక చనిపోగా నాలుగు అస్వస్థతకు గురయ్యాయని తెలిపాడు.

కూతురు ప్రేమ వివాహానికి సహకరించిందని హత్యాయత్నం

● నిందితురాలికి మూడేళ్ల జైలు శిక్ష

వేములవాడ టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తన కూతురు ప్రేమ వివాహానికి సహకరించిందనే అనుమానంతో ఓ యువ తిని బిల్డింగ్ పైనుంచి కిందకు తోసేసి హత్యాయత్నానికి పాల్ప డిన మహిళకు మూడేళ్లజైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించినట్లు వేములవాడ అసిస్టెంట్ సెషన్‌కోర్టు న్యాయ మూర్తి అజయ్‌కుమార్ జాదవ్ తీర్పు వెల్లడించినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన కోనేటి రవి, రాజమణి దంపతుల కూతురు ప్రేమలత ప్రేమవివాహం చేసుకోవడానికి వేములవాడ పట్టణం తిప్పాపూర్‌కు చెందిన జనార్దన్ కూతురు కారణమని, ఇంటికి వచ్చి మాట్లాడుతానని సదరు యువతిని రాజమణి బిల్డింగ్ పైకి తీసుకువెళ్లి కిందకు తోసేసింది. ఈ సంఘటనపై 2020 ఫిబ్రవరి 7వతేదీన రాజమణిపై వేములవాడ పోలీస్ స్టేషన్‌లో యువతి తండ్రి జనార్దన్ ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై మాలకొండ రాయుడు కేసు నమోదు చేయగా, దర్యాప్తు చేసిన సీఐ వెంకటేష్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీంతో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ తరపున రాజిరెడ్డి వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అజయ్‌కుమార్ జాదవ్ నిందితు రాలికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధించినట్లు వెల్లడించారు. నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన సంబంధిత అధికారులను ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరికి జైలు శిక్ష

కోల్‌సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తూ గోదావరిఖని బస్టాండ్‌లో పట్టుబడ్డ ఇద్దరు నేరస్థులు ప్రసన్ జిత్‌రాయ్, కమలేష్ గోలలకు గురువారం పెద్దపల్లి కోర్టు ఐదేళ్ల శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు 2017లో ఆర్‌టీసీ బస్‌స్టాండ్‌లో పెట్రోలింగ్ చేస్తూ అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా ఒక్కొక్కరి బ్యాగ్‌లో 5కిలోల చొప్పున మొత్తం 10కిలోల గంజాయి దొరికింది. విచారణలో వీరు ఒడిశాలో గుర్తుతెలియనివ్యక్తి దగ్గర కొనుగోలు చేసినట్లు అంగీ కరించారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ జీ కృష్ణ కేసునమోదు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పం పారు. తదుపరి నేరపరిశోధన పూర్తిచేసి చార్జ్‌షీట్ నమోదుచేశారు. జిల్లాజడ్జి కోర్టు పెద్దప ల్లిలో కేసు విచారణ జరుగగా ఇరువురి వాదనలు విని నేరం రుజువుకావడంతో జడ్జి సునీత వారికి 5సంవత్సరాల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించారు. నేరస్తునికి శిక్ష పడడానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదం రమేష్ కృషిచేశారు. సాక్ష్యులను ప్రవేశపెట్టడానికి సహకరించిన ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, కోర్టుకానిస్టేబుళ్ల అరుగొండ సతీశ్‌కుమార్, పీ కోటే శ్వరరావుకు రామగుండం పోలీస్‌కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందనలు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జరిమానా

జగిత్యాల క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి మూడు వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ మెజిస్ట్రేట్ శ్రీనిజ కోహిర్ కార్ గురువారం తీర్పునిచ్చారు. మల్యాల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి 2017 సంవత్సరంలో అప్పటి ట్రాఫిక్ ఎస్సైగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో ట్రాఫిక్ ఎస్సై ఫిర్యాదు మేరకు శేఖర్‌పై జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడు శేఖర్‌కు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు కోర్టు డ్యూటీ అధికారి రాజేశ్వర్ రావు పేర్కొన్నారు.

ఐదుగురి బైండోవర్

జగిత్యాల క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో నేరాల అదుపు కోసం ఐదుగురు పాత నేరస్థులను గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణానికి చెందిన బూసి రాజు, కొక్కు కళ్యాణ్, భారతపు రాజు, చింత రాజేందర్, బూసి మనోజ్‌లు పాత నేరస్థులని భవిష్యత్‌లో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు గాను బైండోవర్ చేసినట్లు వివరించారు.

కుటుంబ గొడవలతో బావపై కత్తితో దాడి: కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మాతాశిశు కేంద్రంలో గురువారం సాయంత్రం కుటుంబసభ్యుల మధ్య జరిగిన గొడ వలో బావ పాలకుర్తి మహేష్‌పై బామ్మర్ది కాసగోని మహేష్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. రెండో రాణా సీఐ సృజన్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన కాసగోని మహేష్ తన బావ అయిన ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన పాలకుర్తి మహేష్‌పై కత్తితో దాడి చేయగా వీపు, చేయి, తలకు గాయాలయ్యాయి. ఆసుపత్రి సిబ్బంది, పేషెంట్‌లు కేకలు వేయటంతో ఇద్దరూ బయటకు పరిగెత్తారు. పాలకుర్తి శ్రావణి 3నెలల గర్భవతికాగా ఆమెను మాతాశిశు ఆసుపత్రిలో చేర్పించారు. రక్తస్రావం ఎక్కువ అవుతుండటంతో ఆసుపత్రి సిబ్బంది అబార్షన్ చేశారు. శ్రావణి భర్త పాలకుర్తి మహేష్ ఆసుపత్రికి చేరుకుని తన భార్యకు అకార ణంగా అబార్షన్ చేయించారని అక్కడ ఉన్న అత్త మామలతో గొడవపడ్డాడు. అక్కడే ఉన్న బామ్మర్ది జోక్యం చేసుకోగా అతనితో కూడా గొడవ పడ్డాడు. ఈ సమయంలోనే బావ, బావమరిదిల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బావ అయిన పాలకుర్తి మహే ష్‌పై బావమరిది అయిన కాసగోని మహేష్ కత్తితో దాడిచేసి అక్కడి నుంచి పారిపోయాడు. కాసగోని మహేష్ మాతా, శిశు ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. సమాచారం అందుకున్న రెండో రాణా సీఐ కె సృజన్‌రెడ్డి మాతాశిశు ఆసుపత్రికి చేరుకుని శ్రావణి, ఆమె తల్లిదండ్రులను విచారిస్తున్నా రు. నిందితుడి కోసం గాలిస్తున్నారు. గాయపడిన పాలకుర్తి మహేష్ ఒకప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సీఐ తెలిపారు. కాగా శ్రావణి మాట్లాడుతూ తన భర్త గత మూడేళ్ల నుంచి నిత్యం తనతోపాటు తన తల్లిదండ్రులతో గొడవ పడుతున్నా డని ఆరోపించింది. గురువారం సాయంత్రం కూడా తన భర్త పాలకుర్తి మహేష్ ఆసుపత్రిలో ఉన్న తన వద్దకు వచ్చి, తనతల్లి, తండ్రి, సోదరుడు మహేష్‌తో గొడవకు దిగి, కొట్టి, చంపుతానంటూ బెదిరించా డని తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కారు, రెండు లారీలు ఢీ: లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన లారీ

కోరుట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణం లోని మెట్‌పల్లిరోడ్డు అష్టలక్ష్మి దేవాలయం యూటర్నింగ్ వద్ద జాతీయరహదారిపై గురువారం వేకవజామున రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. ఆదర్శనగర్‌వైపు వెలుతున్న కారు అష్టలక్ష్మి దేవాలయ మూలమలుపు వద్ద డీవైడ ర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు యజమాని కారును అక్క డే ఉంచాడు. అదేసమయంలో మెట్‌పల్లి నుంచి వస్తు న్న లారీ ప్రమాదం గమనించి రోడ్డుపై లారీని ఆపే ప్రయత్నం చేస్తుండగా వేగంగా వస్తున్న మరో లారీ ఆగుతున్న లారీని ఢీకొట్టింది. ముందున్న లారీ కారును ఢీకొట్టింది. సంఘటనలో కారు, లారీలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఓ లారీ డ్రైవర్‌కు తీవ్రగాయలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడిచేరుకొని రోడ్డుపై ఉన్న వాహనాలను క్రేన్‌ల సహాయంతో తొల గించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

కాంబోడియాలో సైబర్ మోసాలు..

105 మంది భారతీయుల అరెస్టు

- 138 ప్రాంతాల్లో కాంబోడియా పోలీసుల దాడులు
- 3,075 మంది అనుమానితుల పట్టివేత

న్యూఢిల్లీ, జూలై 24: కాంబోడియా కేంద్రంగా చైనా సైబర్ నేరగాళ్లు నిర్వహిస్తున్న కాల్ సెంటర్లపై అక్కడి పోలీసులు దాడులు జరిపారు. 15 రోజుల పాటు.. 138 ప్రాంతాల్లో జరిపిన ఈ దాడుల్లో మొత్తం 3,075 మంది అనుమానితులను అరెస్టు చేశారు. వీరిలో 105 మంది భారతీయులున్నారు. నిజానికి భారతీయులను ఉద్యోగాల పేరుతో కాంబోడియా, మయన్మార్ వంటి దేశాలకు తీసుకెళ్తున్న చైనా సైబర్ కేటుగాళ్లు.. వారిని అక్కడ నిర్బంధిస్తున్నారు. బలవంతంగా సైబర్ నేరాల కాల్ సెంటర్లు నిర్వహించేలా చేస్తున్నారు. మాట వినకుంటే.. కరెంటు షాకులివ్వడం, తిండితిప్పలు లేకుండా చేస్తూ.. హింసిస్తున్నారు. దీనిపై భారత ప్రభుత్వం పలు దఫాలుగా కాంబోడియా ప్రభుత్వంతో చర్చించింది. ఈ క్రమంలో కాంబోడియా పోలీసులు ఈ దాడులు జరిపారు. అరెస్టయిన వారిలో భారతీయులతోపాటు.. వివిధ దేశాల పౌరులు ఉన్నారు. కాగా.. ఈ దాడుల్లో అరెస్టయిన 105 మంది భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్ర హోంశాఖ చర్యలను ప్రారంభించినట్లు తెలుస్తోంది.

అమెరికాలో భారీగా పడిపోయిన జననాల రేటు

న్యూయార్క్, జూలై 24: అమెరికాలో సంతానోత్పత్తి దారుణంగా పడిపోతోంది. గతంలో ఎప్పుడూ లేనంత తక్కువగా గత ఏడాది జననాల రేటు నమోదైంది. 2024కు సంబంధించి వ్యాధి నియంత్రణ, నివారణ సెంటర్లు (సీడీసీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో సంతానోత్పత్తి తగ్గిపోయిన విషయం స్పష్టమైంది. జనాభా భర్తీ రేటు ప్రకారం సగటున ప్రతి మహిళకు 2.1 కంటే ఎక్కువగా పిల్లలు ఉండాల్సిన తరుణంలో.. అమెరికాలో జననాల రేటు 1.6 కంటే తక్కువగా నమోదైందని సీడీసీ వెల్లడించింది. 1960ల్లో యూఎస్‌లో జననాల రేటు సుమారు 3.5గా ఉంది. ఆ తర్వాత నుంచి క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. జననాల రేటు తగ్గిపోతోందన్న హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం సంతానోత్పత్తిని పెంచడానికి ఇటీవల చర్యలు చేపట్టింది.

గర్భిణి అనుమానాస్పద మృతి

- భార్య మృతదేహంతో 3 రోజులు ఇంట్లోనే భర్త
- స్థానికులు గమనించడంతో పరారీ

బెంగళూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలోని హెణ్ణూరు థణిసంద్రలో ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతదేహంతో భర్త ఇంట్లోనే మూడు రోజులపాటు గడిపాడు. ఆ ఇంట్లోంచి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించారు. దీంతో బుధవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివం, ఆయన భార్య సుమన్ ఆ ఇంట్లో నివసించేవారు. శివం పెయింటింగ్ పనులు చేసేవాడు. మూడురోజుల కిందట సుమన(22) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆ రోజు శివం పనుల కోసం బయటకు వెళ్లాడు. భార్య మృతిచెందాక పనులకు వెళ్లాడా, ఆయన వెళ్లాక ఆమె మృతిచెందిందా అన్నది స్పష్టత లేదు. కానీ ఆ మరుసటి రోజు భార్య మృతదేహం వద్దే శివం గడిపినట్లు, అక్కడే మద్యం సేవించి, భోజనం చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. మూడో రోజు బుధవారం ఇంటి నుంచి దుర్వాసన రావడం మొదలైంది. దీంతో స్థానికులు ఆ రోజు మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లగా.. శివం ఒక్కసారిగా అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే వారు హెణ్ణూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సుమన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, శివం కోసం గాలిస్తున్నారు. సుమన మృతికి కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు.

అనిల్ అంబానీ సంస్థలపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ, జూలై 24: మూడువేల కోట్ల రూపాయల బ్యాంకు రుణ మోసం, నగదు అక్రమ చలామణీ కేసు దర్యాప్తులో భాగంగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కంపెనీలు, ఎస్ బ్యాంకుకు చెందిన 35 కార్యాలయాలపై దాడులు చేశారు. నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం కింద 25 మందిని ప్రశ్నించారు. ఆయా కార్యాలయాల నుంచి పలు పత్రాలు, కంప్యూటర్ ఉపకరణాలను (ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌ల వంటివి) స్వాధీనం చేసుకున్నారు. 2017-2019 మధ్య 'ఎస్ బ్యాంకు' అధికారులకు రిలయన్స్ గ్రూపు కంపెనీలు లంచాలు ఇచ్చి.. ఆ బ్యాంకు నుంచి రూ.3000 కోట్ల మేర రుణాలు పొంది, ఆ రుణాలను అక్రమంగా దారి మళ్లించాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఆ రుణాల మంజూరుకు ఎస్‌బ్యాంకు వర్గాలు పలు నిబంధనలను ఉల్లంఘించాయని.. పాత తేదీతో రూపొందించిన రుణ మంజూరు గుర్తింపు పత్రాలను ఉపయోగించాయని.. మంజూరైన రుణాలను రిలయన్స్ గ్రూప్‌లోని పలు ఇతర సంస్థలకు, షెల్ కంపెనీలకు మళ్లించారని ఆరోపణలు రావడంతో.. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) 2022 సెప్టెంబరులో రెండు కేసులు నమోదు చేసింది. ఈ రెండు కేసుల్లోనూ ఎస్ బ్యాంకు సహ వ్యవస్థాపకుడు, ఆ బ్యాంకు మాజీ ఎండీ రాణా కపూర్ పేరును సీబీఐ ప్రస్తావించింది. సీబీఐ పెట్టిన రెండు కేసులతోపాటు.. ఈ వ్యవహారానికి సంబంధించి నేషనల్ హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. బ్యాంకులను, షేర్‌హోల్డర్స్‌ను, ఇన్వెస్టర్లను, ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేసి ప్రజాధనాన్ని దారి మళ్లించడానికి పక్కా ప్రణాళికతో ఈ ఫ్రాడ్‌కు రూపకల్పన చేసినట్టు ఆయా సంస్థలు ఇచ్చిన నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అప్పట్లో రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు రుణం మంజూరు కావడానికి ముందే.. ఎస్ బ్యాంకు ప్రమోటర్లు 'నగదు (లంచం)' అందుకున్నట్టుగా ఈడీ తన ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిందని విశ్వసనీయవర్గాల సమాచారం. ఎస్‌బ్యాంకు వద్దే కాదు.. కెనరా బ్యాంకు వద్ద సైతం ఆర్‌కామ్ ఇదే తరహాలో లంచాలిచ్చి రూ.1050 కోట్లకు పైగా రుణాలను పొందిన వైనంపైనా ఈడీ దృష్టి పెట్టినట్టు సమాచారం. రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ సంస్థ బ్యాంకులు జారీ చేసే ఏటీ-1 (అడిషనల్ టైర్-1) బాండ్లలో రూ.2850 కోట్ల దాకా పెట్టుబడి పెట్టిందని.. అందుకు బదులుగా ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని ('క్విడ్ ప్రో కో'గా) ఈడీ భావిస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. కాగా.. ఈడీ సోదాలతో తమ వ్యాపార కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావమూ పడలేదని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా కంపెనీలు వేర్వేరు ప్రకటనలు చేశాయి. ఈడీ సోదాలకు సంబంధించి మీడియా కథనాల్లో పేర్కొంటున్న ఆరోపణలు రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) లేదా రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్) పదేళ్ల క్రితం జరిపిన లావాదేవీలకు సంబంధించినవని వెల్లడించాయి.

ఇదేం తీర్పు?

- నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం



బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ మంజూరుచేసిన హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహించింది. 'వివేకాన్ని వాడే హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చిందా.?' అని ఘాటుగా ప్రశ్నించింది. న్యాయ విచక్షణాధికారం తీవ్రంగా దుర్వినియోగం అయిందని వ్యాఖ్యానించింది. బెయిల్ ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రిజర్వులో ఉంచింది. 'ఇలాంటి కేసుల్లో బెయిల్ ఇవ్వవచ్చా? హైకోర్టు చేసిన తప్పునే మేం కూడా చేయదలుచుకోలేదు. బెయిల్ తీర్పును ఇచ్చేముందు విచక్షణాధికారాన్ని కోర్టు ఉపయోగించిందో లేదో పరిశీలించాలని అనుకుంటున్నాం. అందువల్ల పిటిషన్‌పై తొందరపడి తీర్పు ఇవ్వడంగానీ, విడుదలకు లేక శిక్షలకు ఆదేశాలు ఇవ్వడంగానీ చేయబోం" అని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా.. దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ ఇచ్చిన తీరును బెంచ్ తప్పుబట్టింది. "ప్రతి బెయిల్ తీర్పును హైకోర్టు ఇలాగే రాస్తుందా? ఈ కేసును హైకోర్టు చూసిన దృష్టి ఎక్కువగా మమ్మల్ని ఇబ్బంది పెట్టింది. సెషన్స్ కోర్టు జడ్జి అయితే అర్థం చేసుకోవచ్చు. కానీ, హైకోర్టు న్యాయమూర్తి ఇలాంటి పొరపాటు చేయడమేంటి? ఇంతేనా జడ్జి అవగాహన?. ఇది కుట్ర, హత్యలకు సంబంధించిన కేసు కావడంతో మా స్వరం కొంచెం కటువుగానే ఉంటుంది." అని బెంచ్ తెలిపింది. రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్, నటి పవిత్రాగౌడ, ఇతర నిందితులకు గత ఏడాది డిసెంబరు 13న కర్ణాటక హైకోర్టు బెయిల్ ఇచ్చింది. దీనిపై కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా ఈ కేసులో పవిత్ర పాత్రపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. "అంతా మీవల్లే జరిగింది. మీరు అక్కడ లేకపోతే ఏ2 పట్టించుకునేవారుకాదు. ఏ2 స్పందించకపోతే మిగతావారూ పట్టించుకునేవారు కాదు. మొత్తం సమస్యకు మీరే కారణం." అంటూ ఆగ్రహించింది. దీనిపై పవిత్ర తరఫు న్యాయవాది స్పందిస్తూ.. "ఆమెకు (రేణుకాస్వామి నుంచి) అభ్యంతరకర మెజేస్‌లు వచ్చేవి. నేరుగా మాట్లాడిన కాల్ రికార్డులు లేవు. అపహరణ, హత్యతో ఆమెకు సంబంధం ఉన్నట్టు ఆధారాలు లేవు" అని వాదించారు. అయితే, తాము వాదనల లోతుల్లోకి వెళ్లదలుచుకోలేదని బెంచ్ స్పష్టం చేసింది. గార్డులు కిరణ్, పునీత్‌ల వాంగ్మూలాలను హైకోర్టు ఎందుకు తిరస్కరించిందని బెంచ్ నిలదీసింది. కర్ణాటక ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. కాల్ డేటా రికార్డులు, లొకేషన్ పిన్‌లు, దుస్తులపై, వాహనంలో దొరికిన డీఎన్ఏ, ఇతర ఆధారాలు వారిద్దరి వాంగ్మూలాలను ధ్రువీకరించాయని వాదించారు. సాక్ష్యాధారాల తీరుపై బెంచ్ పలు ప్రశ్నలు సంధించింది. "నిందితుల నుంచి మీరు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దాడి దృశ్యాలను దానిలో ఎలా బంధించారు?." అని ప్రశ్నించింది. దీనికి లూథ్రా బదులిస్తూ.. దాడి ఫొటోలు ఏ2కు ఫార్వర్డ్ అయ్యాయని, తనను కొట్టవద్దు అని హతుడు వేడుకొంటుండగా తీసిన ఫొటో కూడా అందులో ఉన్నదని తెలపగా, బెంచ్ విస్మయానికి గురయింది. "ఒకవైపు కొడుతున్నారు.. మరోవైపు ఫొటోకు పోజు ఇస్తున్నారు.. నిజంగా నమ్మలేకపోతున్నాం." అని వ్యాఖ్యానించింది. వారు తమ అభిమాన నటుడి కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉండే దర్శన్ అభిమాన సంఘానికి చెందినవారని లూథ్రా వివరించారు. "ఇదో కిరాతక హత్య. సోషల్ మీడియాలో పోస్టు చేశారనే కారణంగా రేణుకాస్వామిని కిడ్నాప్ చేసి కిరాతకంగా హతమార్చారు. నిందితులు దర్శన్, పవిత్రగౌడ సహా అందరి కండిషన్ బెయిల్‌ను రద్దు చేయాలి" అని ఆయన కోరారు. కాగా, దర్శన్ తరఫు న్యాయవాది కపిల్‌సిబల్ మరో కేసును వాదించేందుకు వెళ్లడంతో లిఖితపూర్వక వాదనల కోసం వారంరోజుల గడువు ఇస్తున్నామని బెంచ్ తెలిపింది. దీంతో బెయిల్ రద్దు కావచ్చునని నిందితులలో భయం పట్టుకుంది. నిందితులకు వ్యతిరేకంగానే తీర్పు ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. 'డెవిల్' సినిమా షూటింగ్ కోసం నటుడు దర్శన్ థాయ్‌లాండ్‌కు వెళ్లిన విషయం తెలిసిందే.

నకిలీ ఓట్లను అనుమతించేదే లేదు

- ఓటర్ల తొలగింపు అబద్ధం: సీఈసీ
- బిహార్‌లో ప్రత్యేక సవరణకు సమర్థన

న్యూఢిల్లీ, జూలై 24: బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్)ను ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ గట్టిగా సమర్థించుకున్నారు. నకిలీ ఓటర్లు ఓటేయడానికి అనుమతించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో అసలైన ఓటర్లను తీసివేస్తున్నామన్న విపక్షాల ఆరోపణలను ఖండించారు. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా అమలు చేయబోతున్నట్లు ఆయన తాజాగా ప్రకటించారు. అయితే కర్ణాటకలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని.. నూరు శాతం రుజువులున్నాయని.. ఒక నియోజకవర్గంలో వందలు, వేల అదనపు ఓటర్లను చేర్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అయితే నిరాధార ఆరోపణలు చేయొద్దని, రాజ్యాంగ సంస్థను బెదిరిస్తున్నారని ఈసీ ఆక్షేపించింది. కాగా, బిహార్లో ప్రత్యేక సవరణను నిరసిస్తూ ఇండియా కూటమి ఎంపీలు గురువారం పార్లమెంటు ద్వారం వద్ద వరుసగా నాలుగో రోజూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రాహుల్ ఈసీపై విరుచుకుపడ్డారు. కర్ణాటకలో ఓ లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై 90 శాతం కాదు.. నూరు శాతం రుజువులు చూపిస్తామని తెలిపారు. అయితే.. రాహుల్ చేసిన ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. నిరాధార ఆరోపణలు చేయడమే గాక.. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమిషన్‌ను ఆయన బెదిరిస్తున్నారని విమర్శించింది.

జడ్జిల నియామకంలో జాప్యంపై విచారణ

- రెండు వారాల తర్వాత చేపట్టనున్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 24: జడ్జిల నియామకంపై కొలీజియం చేస్తున్న సిఫార్సులను ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుండడాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరిపేందుకు గురువారం సుప్రీంకోర్టు అంగీకారం తెలిపింది. రెండు వారాల తరువాత విచారణ చేపడుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్లను 2023లోనే లిస్టు చేశారని, అనంతరం ఆకస్మికంగా వాటిని జాబితా నుంచి తొలగించారని సీనియర్ న్యాయవాది అరవింద్ దాతర్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

నేటి నుంచి సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీలు

● హాజరుకానున్న వంద జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్‌బోర్డ్‌ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ క్లస్టర్-7 కబడ్డీ పోటీలు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కరీంనగర్‌లోని వివేకానందసీబీఎస్ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రారంభం కానున్నాయి. ఈపోటీల్లో క్లస్టర్-7లోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల నుంచి సుమారు 100జట్లు పాల్గొననున్నాయి. పోటీలను అండర్-14,-17,-19 విభాగాల్లో కేవలం బాలురకు మాత్రమే నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు పాఠశాలలోనే ఉచిత భోజన, వసతి సౌకర్యాలను ఏర్పాటుచేశారు. పోటీలను ఘనంగా నిర్వహించేందుకు మూడు కబడ్డీకోర్టులను మ్యాట్లతో ఏర్పాటుచేశారు. పోటీలను రాత్రి, పగలు నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 9:30 గంటలకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ప్రత్యేకఅతిథులుగా జిల్లాకబడ్డీ అసోసియేషన్‌చైర్మన్ వెలిచాల రాజేందర్ రావు, అధ్యక్షులు డాక్టర్ సీహెచ్ అమిత్‌కుమార్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్ హాజరుకానున్నారు.

ఐటీఐ, ఏటీసీల్లో రెండో విడత అడ్మిషన్లు

● మొదలైన ఆన్‌లైన్ ప్రక్రియ

గణేశ్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ, ఏటీసీల్లో రెండోవిడత అడ్మిషన్‌లప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు కరీంనగర్ ప్రభుత్వఐటిఐ ప్రిన్సిపాల్ కె అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఐటీఐ కరీంనగర్‌లో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్, మెకానిక్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్, వెల్డర్, మెకానిక్ ఆటో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, టెక్నీషియన్ స్మార్ట్ అగ్రికల్చర్, సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, వర్చువల్ అనాలిసిస్, డిజైనర్-ఫెమ్, మెకానిక్ ఎలక్ట్రిక్‌వెహికల్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్‌అండ్‌డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్‌కంట్రోల్‌అండ్ ఆటోమేషన్‌టెక్నీషియన్, ఇంజనీరింగ్ డిజైన్‌టెక్నీషియన్‌కోర్సుల్లో వెబ్‌సైట్ https://iti.telangana.gov.inద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:31-07-2025 ఉంటుందన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశం

● దోస్త్ స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల

గణేశ్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో అడ్మిషన్ పొందేందుకు చివరి అవకాశంగా దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ) స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్‌ను ఉన్నతవిద్యామండలి జూలై24న విడుదలచేసినట్లు ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. దోస్త్ షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్ ద్వారా జూలై 25నుంచి జూలై 31వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు3న స్పెషల్‌ఫేస్ అడ్మిషన్ల అలాట్మెంట్ ప్రకటిస్తారని తెలిపారు. ఆగస్టు6వరకు సీట్లుపొందిన విద్యార్థులు కళాశాలలో ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్టింగ్ పూర్తిచేసుకోవాలని సూచించారు. విద్యార్థి ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయకపోయినా, కళాశాలలో సీసీ ఓటీపీతో రిపోర్ట్ చేయకపోయినా సీటు రద్దు అవుతుందని తెలిపారు. స్పెషల్ ఫేస్ అడ్మిషన్‌కు చివరి అవకాశం అని చెప్పారు. ఇప్పటివరకు మూడు విడతల్లో అడ్మిషన్ పొందని విద్యార్థులు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించకుండా స్పెషల్ ఫేస్‌లో పాల్గొనవచ్చన్నారు. ఇదివరకు దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు 400రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి స్పెషల్‌ఫేస్‌లో పాల్గొనవచ్చునని తెలిపారు.

కొనసాగుతున్న అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ

గణేశ్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు 13ఆగస్టు వరకు అవకాశం ఉందని ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వరలక్ష్మి, కోఆర్డినేటర్ డా.మనోజ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్, ఐటీఐ, డిప్లొమా విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌చేసి రశీదుపొందాలన్నారు. సమాచారం కోసం ఫోన్7382929755 నంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

గురుకులాల్లో స్టీల్ పాత్రలు

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ● మల్లాపూర్ గురుకులం ఆకస్మిక తనిఖీ
● వర్షాకాలం నేపథ్యంలో శుభ్రతపై పలు సూచనలు




విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మారం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో వంటలకు స్టేన్‌లెస్ స్టీల్ పాత్రలు అందిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం మల్లాపూర్ గురుకుల పాఠశాల - కళాశాలను ఆయన తనిఖీచేశారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. క్లీనింగ్ ఏరియాలో పూర్తిగా టైల్స్ వేయించాలని, అందుకు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కిచన్‌తో పాటు డైనింగ్ హాల్ శుభ్రంగా ఉండాలని ప్రిన్సిపాల్ దేవసేనను ఆదేశించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి వర్షాకాలంలో శుచి శుభ్రత పాటించాలన్నారు. డైనింగ్‌హాల్ చిన్నగా ఉండి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు పాఠశాల పాత బిల్డింగ్‌ను పరిశీలించి డైనింగ్‌ను పెంచేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. పాఠశాలలో ఉదయం 7.30 గంటలకే అసెంబ్లీ ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 9గంటలకు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాలసిబ్బంది మంత్రికి వినతిపత్రం అందజేయగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేస్తూ సౌకర్యాల గురించి విద్యార్థులను ఆరాతీశారు. పాఠశాలలో అన్నీబాగానే ఉన్నాయని విద్యార్థులు తెలుపడంపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉండడంతో మందులు సరిపోవడం లేదని మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే కలెక్టర్ కోయ శ్రీహర్షతో ఫోన్‌లోమాట్లాడి సమస్యను వివరించారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని మరోఇద్దరు హెల్త్‌వర్కర్స్‌ను పాఠశాలను విజిట్ చేయించాలని, విద్యార్థులకు సరిపడా మందులు అందజేయాలని కలెక్టర్‌కు సూచించారు. పాఠశాలలో నీటికొరతను దృష్టిలో ఉంచుకొని వెంటనే బోర్‌వెల్ వేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన అడ్లూరి అల్యూమినీయం పాత్రల్లో వంటకాలవల్ల విద్యార్థులకు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగాఉన్న గురుకులాల్లో స్టీల్‌పాత్రలు అందిస్తామన్నారు.

పేదల కలలను సాకారం చేయడమే లక్ష్యం

గొల్లపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఉందని.. అందులో తాను మంత్రిగా ఉన్నానని నిరుపేదల కలలను సాకారం చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. గొల్లపల్లి మండలం ఆత్మకూర్ గ్రామంలో అత్తెన రాజమల్లు అనే నిరుపేద దివ్యాంగుడికి ప్రభుత్వం మంజూరుచేసిన ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ పత్రాన్ని లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీ మేరకు నిరుపేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సాకారం చేస్తున్నామని, ఇదీ తమకు ఆత్మతృప్తిని కలిగిస్తోందన్నారు. పేదలు, అభాగ్యులు, బడుగు బలహీన వర్గాలవారికి తాను ఎల్లావేళలా వెన్నంటి ఉంటానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం గొల్లపల్లి మండలకేంద్రంలోని వైకుంఠధామాన్ని మంత్రి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా శ్మశానవాటిక వరకు రహదారి నిర్మాణానికి మంత్రి హామీఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్‌చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, తహసీల్దార్ వరందన్, ఎంపీడీవో రాంరెడ్డి, కాంగ్రెస్‌యూత్ మండలశాఖ అధ్యక్షులు పురంశెట్టి గౌతమ్ రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులునేరెళ్ల మహేష్, రేవెళ్ల సత్యానారాయణ గౌడ్, కొంద్ర గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌లో అంతరపంటలతో అదనపు ఆదాయం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ శేఖర్

గొల్లపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్‌సాగులో అంతరపంటల సాగు ద్వారా అదనపు ఆదాయం గడించవచ్చని రాష్ట్ర ఉద్యానవనశాఖ కార్యాలయం నుంచి జిల్లాకు పర్యవేక్షకఅధికారిగా నియమితులైన డిప్యూటీ డైరెక్టర్‌శేఖర్ రైతులకు సూచించారు. గురువారం గొల్లపల్లి మండలంలోని బీబీరాజ్‌పల్లె గ్రామంలో ఉద్యానవనశాఖ, లోహియా ఎడిబుల్‌ఆయిల్స్ ప్రైవేట్‌లిమిటెడ్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్‌సాగు, వివిధ రకాల ఉద్యానవన పంటలు-పథకాలపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీడైరెక్టర్ శేఖర్ మాట్లాడుతూ 2025-26ఆర్థిక సంవత్సరంలో ఉద్యానవనశాఖ, లోహియాఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మొక్కలునాటే కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ తోటలో అరటి, బొప్పాయి, వక్క, కోకో వంటి అంతరపంటల సాగుతో అదనపు ఆదాయాన్ని ఆర్జించవచ్చని తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కనాటిన మూడు సంవత్సరాల నుంచి దిగుబడి ప్రారంభమై 30 సంవత్సరాల వరకు నిరంతరాయంగా లాభాలు గడించవచ్చన్నారు. 1993ఆయిల్ పామ్ చట్టం ప్రకారం గెలలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కంపెనీ కొనుగోలు చేస్తుందన్నారు. అనంతరం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగుపట్ల రైతులుఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ఆయిల్‌పామ్‌తోపాటు మామిడి, అరటి, బొప్పాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మవంటి పండ్ల తోటల పెంపకానికి రాయితీ అందిస్తున్నామన్నారు. ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. జిల్లాలోని రైతులంతా ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ పెంచాల సుజాతతిరుపతి, మాజీఉపసర్పంచ్‌మాలోతు రాజేందర్ నాయక్, జిల్లా ఉద్యానవవశాఖ అధికారి స్వాతి, ఏఈవోవంశీ, లోహియా జిల్లామేనేజర్ విజయ్‌భరత్, క్షేత్రస్థాయి సిబ్బంది, డ్రిప్ కంపెనీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు జగిత్యాల క్రీడాకారిణి



వేముల శాన్వి

జగిత్యాల అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25నుంచి 28తేదీ వరకు చండీఘడ్‌లో జరుగనున్న జతీయస్థాయి కబడ్డీపోటీలకు జగిత్యాల క్రీడాకారిణి వేములశాన్వి ఎంపికై నట్లు జిల్లాకబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, కార్యదర్శి ఆరె తిరుపతి ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల13న నిజమాబాద్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ కబడ్డీ పోటీల్లో వేములశాన్వి అత్యంత ప్రతిభకనబరిచి తెలంగాణ కబడ్డీజట్టుకు ఎంపికైంది.కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బోగ ప్రవీణ్‌కుమార్, కార్యవర్గసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి వరద

ధర్మపురి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి వరద గురువారం స్వల్పంగా పెరిగింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల వల్ల చెరువులు, కుంటలు, వాగుల నుంచి ప్రవహిస్తున్న నీరు గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో స్వల్పంగా గోదావరినది నీటిమట్టం పెరిగింది. గోదావరి వరదను ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ పరిశీలించారు. గోదావరినది లోతుప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయవద్దని సూచించారు. నదీతీరానగల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులు, గొర్రెల కాపర్లు, చేపలు పట్టే మత్స్యకార్మికులు నదివైపు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్ వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

ఎస్సారార్ కళాశాలకు పుస్తకాల వితరణ



పుస్తకాలతో ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్,సిబ్బంది

గణేశ్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన గ్రంథాలయం, శ్రీరాజరాజేశ్వరకళాశాల, కరీంనగర్‌కు శ్రీసుల్తాన్ చాంద్‌ట్రస్ట్, న్యూఢిల్లీ వారు రూ.15,05,000 విలువగల 3,212 పుస్తకాలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ మాట్లాడుతూ విలువైన పుస్తకాలను కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుక్ బ్యాంక్ ద్వారా అందించిన ఈ పుస్తకాలు ప్రభుత్వ విద్యాసంస్థలకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని టీజీసీటీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రంథాలయ పాలకుడు డాక్టర్ జి కృష్ణారెడ్డి, ఉపప్రిన్సిపాల్ టి రాజయ్య, అటానమస్ కోఆర్డినేటర్ డాక్టర్ వి శ్రీనివాస్, డాక్టర్ బూర్లనరేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థుల ఉచిత విద్యకు కృషి



ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంక టయ్యకు సన్మానం

ధర్మారం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్య అందించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో దళిత సంఘాల నాయకులతో సమావేశం అయ్యారు. జిల్లా వ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని, అగ్రవర్ణాలు దళితులపై అనుసరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ వెంకటయ్యకు వినతిపత్రం సమర్పించారు. మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుశన పల్లి రవి, మాల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు దేవి రాజలింగయ్య, ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు నందయ్య, మల్లేశం పాల్గొన్నారు.

వరద నీటిలో రైల్వే అండర్ బ్రిడ్జి.. రాకపోకలకు అంతరాయం



రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వరద నీరు

పెద్దపల్లి రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొత్తపల్లి గ్రామ సమీపంలో నిర్మించిన అండర్ రైల్వే బ్రిడ్జి వరద నీటితో నిండింది. ఓదెల, కాల్వ శ్రీరాంపూర్, జమ్మికుంట, వరంగల్ వైపు, అటు నుండి పెద్దపల్లి వైపు రావాలంటే ఇదే ప్రధాన రహదారి. ప్రస్తుతం వరద నీటితో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తపల్లి రైల్వే గేట్ మూసి వేయడం, అండర్ బ్రిడ్జి కింద వరదనీరు చేరుకోవడంతో పాఠశాలకు విద్యార్థులు వెళ్ళలేని పరిస్థితి ఉంది. బ్రిడ్జి కింద చేరిన నీరు బయటికు వెళ్ళేందుకు కాలువలు సక్రమంగా నిర్మాణం చేపట్టడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ట్రాక్టర్ ద్వారా నిలిచిన నీటిని తొలగిస్తున్నారు. అధికారులు స్పందించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూసి ఉన్న రైల్వే గేట్ తెరవాలి

- బాలసాని లెనిన్, కొత్తపల్లి



రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనుండటంతో గతంలో ఉన్న రైల్వే గేట్‌ను అధికారులు పూర్తిగా మూసి వేశారు. దీంతో అటువైపు ఉన్న గ్రామస్థులు గ్రామంలోకి రావాలన్న, విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూసి ఉన్న రైల్వే గేట్‌ను తెరిపించి ఇబ్బందులు లేకుండా చూడాలి. నిర్మించిన అండర్ బ్రిడ్జి లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి.

గట్టెపల్లి చెక్ డ్యామ్ పనులకు ఆటంకం

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): మూడు రోజులు గా కురుస్తున్న వర్షాలకు గట్టెపల్లి మానేరు వాగులో నిర్మిస్తున్న చెక్ డ్యామ్ పనులకు ఆటంకం కలుగుతుంది. మానేరు పరివాహక ప్రాంత గ్రామాలైన గొల్లపల్లి, గట్టెపల్లి, నీరుకుళ్ల తదితర గ్రామాల పరిధిలోని మానేరు వాగుల్లో వరద ఉధృతి చేరింది. గట్టెపల్లి మానేరు వాగులో గతేడాది నుంచి చెక్‌డ్యామ్ పనులు జరుగుతున్నాయి. వేగురుపల్లి వైపు పనులు పూర్తి కాగా నీరుకుళ్ల వైపు పనులు ఇటీవల ప్రారంభించారు. చెక్ డ్యామ్ నుంచి నీరు ప్రవహిస్తే ఎలాంటి ప్రమాదం లేకుండా బెడ్ నిర్మాణం పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. వరుస గా కురుస్తున్న వానల వల్ల పనులకు ఆటంకంతోపాటు కొంత నష్టం ఏర్పడింది.

కృంగిన బీటీ రోడ్డు

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తారక రామ కాలనీ నుంచి కొలనూర్ వైపు వెళ్లే బీటీ రోడ్డు నెర్రలు ఏర్పడి కృంగింది. రెండు రోజులుగా కురు స్తున్న వర్షాలకు రోడ్డు పక్కన వరద నీటిలో ఈదు కుంట వద్ద రోడ్డుకు బీట లువారింది. కొద్దిపాటి వర్షానికి వేసిన రోడ్డుకు ఒక వైపు కూలిపో వడంతో పూర్తిగా ధ్వంసమయ్యే పరిస్థితి ఉందని రైతు లు తెలిపారు. నాసిరకంగా రోడ్డును నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



వర్షాలతో ఊరట

(5వ పేజీ తరువాయి)

పత్తి, 10,086 ఎకరాల్లో మిర్చి, పసుపు, ఆయిల్‌పామ్, కూరగాయల పంటలు సాగు కానున్నాయని అధికారులు అంచనా వేశారు. వర్షాలు సకాలంలో కురవక పంటలు ఆలస్యంగా సాగవుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 1,03,000 ఎకరాల్లో వరి, పత్తి 43 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. చెరువులు, కుంటలు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరు కోలేదు. మత్తడులు దూకడం లేదు. గత ఏడాది ఇదే నెల రెండో వారం నుంచి భారీ వర్షాలు కురిశాయి. నెలాఖరుకల్లా అన్ని నీటి వనరులు సమృద్ధిగా నిండడంతో రెండు పంటలకు సాగు నీరు లభించి పంటలకు ఢోకా లేకుండా పోయింది.

● ప్రాజెక్టులకు స్వల్పంగా వరద..

జిల్లా రైతులకు జీవనాధారం అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 21.369 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 2.579 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. గత ఏడాది ఇదే సమయానికి నీటిమట్టం 24.376 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు 60 టీఎంసీలకు చేరితే తప్ప సాగు నీటిని విడుదల చేయరు. జిల్లాలో వర్షాలు పడక పోయినా, ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంటుంది. అలాగే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.169 టీఎంసీలకు చేరుకున్నది. ఎగువ ప్రాంతం నుంచి ఉదయం 3,665 క్యూసెక్కుల వరద నీరు రాగా, సాయంత్రం వరకు 452 క్యూసెక్కులకు తగ్గింది. దీనికి ఎగువన గల కడెం ప్రాజెక్టు నిండితే తప్ప ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండే పరిస్థితి లేదు. ప్రాజెక్టు నిండిన తర్వాత వచ్చిన వరద నీటిని వచ్చినట్లే నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరుకు పంపించనున్నారు. రైతులు వర్షాలపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కమాన్‌పూర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. జీహెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, పీఎస్ హెచ్‌ఎం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. జీవో నెంబర్ 25ను సవరించి, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను ఉండాలని, 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండా లని సూచించారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులు, రిటైర్డ్ పెన్షన్ బెనిఫిట్లు విడుదల చేయాలని పేర్కొన్నారు. యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ నాయకులు సదయ్య, రాజు, మల్లేశ్వర్ రావు, రమేష్, నంబయ్య, శంకర్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పక్షాన డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. అన్ని కేడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతాలు చెల్లించాలన్నారు. యూఎస్పీసీ నాయకులు కుమారస్వామి, అప్పిడి సంతోష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పనులను పూర్తి చేయాలి

పెద్దపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మాణంలో గల తాగునీటి సరఫరా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గుంజపడుగు, పుట్టపాక, కమాన్‌పూర్, గుండారం, నాగారం, పెంచికల్‌పేట, రామగిరి, మస్యాల, బేగంపేట, రత్నాపూర్, కల్వచర్ల, పెద్దరాతుపల్లి, ఓదెల, గొల్లపల్లి ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ ఇంట్రా పనులను ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కాంట్రాక్టర్లను రెగ్యులర్‌గా మానిటర్ చేస్తూ పనులు చేయాలని, క్షేత్ర స్థాయిలో పనులు పూర్తి చేసేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఈఈ మిషన్ భగీరథ పూర్ణ చందర్, పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్

భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ రాజయ్య నుంచి పలు వివరాలను తెలుసుకున్నారు. అలాగే రోజువారిగా రిజిస్ట్రేషన్‌లను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిష్కరించడంలో వేగం పెంచాలని సూచించారు. ఆదివారం నాటికి ప్రతి దరఖాస్తుకు నోటీస్ జనరేట్ చేయాలని, రోజుకు కనీసం 20 దరఖాస్తులు డిస్పోస్ చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ రాజయ్య, డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి

పెద్దపల్లి టౌన్, (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతీ ఒక్కరికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని గురువారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయుష్ ఆసుపత్రిని పరిశీలించి 100 పడకల ఆసుపత్రి పనులు, నిర్మాణం పూర్తి చేసుకున్న తాత్కాలిక క్యాజువాలిటీని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి వెనుక ఉన్న ప్రాంతాన్ని విస్తరించి అక్కడి నుంచి పేషెంట్ తరలింపు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, కేసులు తప్పనిసరిగా రిపోర్ట్ అయ్యేలా చూడాలన్నారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్‌ఎంఓ డాక్టర్ విజయ్, నర్సింగ్ సూపరింటెండెంట్ జమున పాల్గొన్నారు.



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్

పాలకుర్తిలో ఘనంగా బోనాలు

పాలకుర్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం గౌడసంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల వేడుకలు జరిగాయి. మక్కాన్‌సింగ్ సేవసమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మండల ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, పాలకుర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు మేర్గు అశోక్, సంతపురి కనుకయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బెల్టులు అందజేత

కాల్వశ్రీరాంపూర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో హుజురాబాద్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నరెడ్ల వీరలక్ష్మి సహకారంతో రూ.5 వేల విలువగల టై, బెల్టులు గురువారం పాఠశాలలోని విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు అత్తె రాజారాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ కుమార్, శ్రీనివాస్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

బనకచర్ల ప్రాజెక్టుపై అవగాహన

కోల్‌సిటీటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందంటూ బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. బీఆర్‌ఎస్‌వీ రామగుండం కో ఆర్డినేటర్ కొలుగూరి సాయికుమార్(చింటు) విద్యార్థులకు కరపత్రాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఒత్తిడితో బనకచర్ల ప్రాజెక్టుకి అనుమతులు ఇచ్చే కుట్ర చేస్తుందన్నారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డిల లోపాయికారి ఒప్పందంలో భాగంగా తెలంగాణ సర్కారు సహకరిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. గోదావరి జలాల పరిరక్షణ కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్లపల్లి అభిషేక్, బండి ప్రదీప్, కళ్యాణ్, మనీ, అభినవ్, రాకేష్, రతిక్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థికి బ్యాడ్జీ లీడర్‌షిప్ బ్యాడ్జీ పెడుతున్న ఎంఈవో మల్లేశం

కోల్‌సిటీటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేశం అన్నారు. గురువారం గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో విద్యార్థుల క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు లీడర్ షిప్ బ్యాడ్జీలను అందజేశారు. విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉంద న్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ గాలి సునీ త, ఇంచార్జీ అరుణ, వైస్ ప్రిన్సిపల్ ఫర్హానా, సుస్మిత, పిఈటీ సుదేష్ పాల్గొన్నారు.

మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థులకు అవగాహన

ఓదెల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని హైస్కూల్లో గురువారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించి ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఇందులో ఎన్నికల నిర్వహణ, ఎన్నికల సిబ్బంది విధులు, రహస్య ఓటును వినియోగించుకునే విధానం నిర్వహించారు. హెడ్ గర్ల్, హెడ్ బాయ్, స్పోర్ట్ కెప్టెన్, పదవుల కోసం మాదిరి ఎన్నికలు నిర్వహించి అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్, ఎన్నిక సర్టిఫికెట్, పదవి బాధ్యతల స్వీకరణ తదితర వాటిపై ఎలక్షన్ ప్రక్రియ నిర్వహిచామని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తెలిపారు.

గోరింటాకుతో ఆరోగ్యం

సుల్తానాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో మహిళలు వైభవంగా జరుపుకునే గోరింటాకు వేడుకలలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం అల్ఫోర్స్ హైస్కూల్‌లో నిర్వహించిన గోరింటాకు వేడుకల్లో ఆయన విద్యార్థులతో కలసి పాల్గొన్నారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతు సంస్కృతీ సంప్రదాయలకు ప్రతీకగా నిలిచే గోరింటాకు వేడుకలు మహిళలు జరుపుకుంటారని వివరించారు.

ట్రినిటిలో గోరింటాకు వేడుకలు

పెద్దపల్లి రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కాసులపల్లి ట్రినిటి ఉన్నత పాఠశాలలో గురువారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. బాలికలు, ఉపాధ్యాయునిలు గోరింటాకును అలంకరించుకున్నారు. గోరింటాకు వల్ల కలిగే లాభాలు విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఆడప బాపురెడ్డి, ఉపాధ్యాయులు మౌనిక, భూదేవి, గీత, మంగ, సౌందరయ్య, శ్యామల, సువార్త , సమ్మయ్య, పాల్గొన్నారు.

పది టాపర్లకు సన్మానం

సుల్తానాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పూసాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించి నగదు పురస్కారాలను అందజేశారు. గాయత్రి, లక్ష్మీప్రసన్న, సింధుజలను సన్మానించి రెండు వేల చొప్పున ముగ్గురికి ఆరు వేల నగదు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్‌రావు, ఎంఈఓ రాజయ్య, హెచ్‌ఎం శ్రీనివాస్, కోఆర్డినేటర్ వల్సా నీలయ్య, సాంబమూర్తి, సతీష్ పాల్గొన్నారు.

కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మంథని, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జపాన్ షిటోరియో షికోకాయ్ విద్యార్థులు ఢిల్లీలో జరిగే జాతీయ కరాటే పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కావేటి సమ్మయ్య గురువారం తెలిపారు. ఎంపికైన వారిలో తహాసిన్‌తైబా, బండారి మణికంఠ, పోగుల శివసాకేత్, మారేడుగొండ రిషిలు ఉన్నట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



ఆటోడ్రైవర్ల కుటుంబాలకు చెక్కులు అందజేసిన వ్యాళ్ల హరీష్‌రెడ్డి, కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

కోల్‌సిటీటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా కుటుంబ పెద్దను కోల్పోయిన, అనారోగ్యంతో బాధపడుతున్న 19 మంది నిరుపేద ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. మాజీ కార్పొరేటర్లు అయిత శివకుమార్, రమణారెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ తస్నీమాభాను, మాజీ కౌన్సిలర్ కృష్ణస్వామి, బొట్ల పోషం, జావిద్‌పాషా, నడిపెల్లి స్వామి పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పాలకుర్తి,(ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్‌లో అల్ట్రాటెక్ కాంట్రాక్టు కార్మికులు కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా మల్లికార్జున స్వామి క్షేత్రంలో పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఐరెడ్డి వెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసి గంట రాములు ఉన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. శంకర్, అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వ హించారు. బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: అందుగులపల్లి లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, సదయ్య, అంజి పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎరబెల్లి ఫామ్ హౌజ్‌లో ఉన్న కేటీఆర్‌ను కలసి పూల మొక్కను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మార్కండేయకాలనీ, (ఆంధ్రజ్యోతి): కోలేటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ జన్మదిన వేడుకలనునిర్వహించారు. లక్ష్మీనర్సయ్యస్వామి పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సాయిగార్డెన్స్‌లో బీఆర్‌ఎస్, ఓసిపి-2లో టీబీజీకేఎస్ నాయకులు కేటీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. శంకేషి రవీందర్, ఒదేలు యాదవ్, పుల్లేలకిరణ్, పాల్గొన్నారు.

అంతర్గాం: తబితా ఆశ్రమంలో కేటీఆర్ జన్మదినాన్ని కోలేటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మంథని: కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలను అంబేద్కర్ చౌక్ కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. శంకర్‌గౌడ్, రాజుగౌడ్, శంకర్‌లాల్, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చౌరస్తాలో, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఏరియా వర్క్‌షాప్‌లో కేక్ కట్ చేశారు.

అన్ని రకాల పెన్షన్లు పెంచి ఇవ్వాలి

సుల్తానాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లోని వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ పెంచాలని వికలాంగుల పోరాట సమితి జిల్లా ఇంచార్జి కన్నం రఘుపతి డిమాండ్ చేశారు. దుబ్బపల్లి వద్ద గురువారం జరిగిన పెన్షన్ దారుల సమావేశంలో సమస్యలు హక్కులు డిమాండ్లపై చర్చించారు. శుక్రవారం పెద్దపల్లిలో నిర్వహించే సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద క్రిష్ణమాదిగ రానున్నారని ఆయన సభకు పెద్ద ఎత్తున తరలిరావాల్సిందిగా రఘుపతి పిలుపునిచ్చారు. దశరథం, శంకర్ ఎల్ల స్వామి, పాల్గొన్నారు.

పూసాల శంభునికుంట మత్తడి ఆక్రమణ

సుల్తానాబాద్, జూలై 24: (ఆంధ్రజ్యోతి): పూసాల శంభునికుంట మత్తడి కొందరు ఆక్రమించారని మాజీ జడ్పీటీసీ, పూసాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గుర్రాల మల్లేశం అన్నారు. గురువారం ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో కలసి మత్తడి ఆక్రమణలకు గురైన విషయాన్ని వారి దృష్టికి తెచ్చారు. ఆక్రమణలకు గురైన మత్తడి భూములను పునరుద్దరించారు. మల్లేశం మాట్లాడుతు మత్తడి ఆక్రమణకు గురి కావడం వలన శంభుని కుంట పరిధి తగ్గిపోయిందని, మత్స్య సంపద కుంట నుంచి బయటకు తరలిపోతుందన్నారు. చెరువుల కుంటల బఫర్ జోన్ భూములను కాపాడుకుంటామన్నారు.

రైతువేదికలో వీపీవోలతో సమావేశం

రామగిరి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రత్నాపూర్ రైతు వేదికలో గురువారం వీపీవోలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శైలజారాణి ఇందిరమ్మ లబ్ధిదారుల నిర్మాణాల పనుల వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలకు అవసరమయ్యే ముడి సరుకులను రాయితీలతో పాటు ఆర్థిక సహాయం కోరే వారికి మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయాలను కల్పించే విధానాలపై చర్చించారు. తహసీల్దార్ సుమన్, స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్, ఎంపీవో ఉమేశ్, ఏఈ రేఖా, పంచాయితీ కార్యదర్శి సంతోష్, పాల్గొన్నారు.

పీవైఎల్ రాష్ట్ర కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

అంతర్గాం, జూలై 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 27న తలపెట్టిన పీవైఎల్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు యువత విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా అనుబంధ ప్రగతి శీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. దేశ అభివృద్ధి లో కీలక పాత్ర పోషించే యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కట్టే తేజేశ్వర్, ఆడెపు శంకర్, రాజు, సంతోష్, అందే సతీష్, హనుమంత్ పాల్గొన్నారు.

అన్ని దానాల కంటే విద్యాదానం గొప్పది

కాల్వశ్రీరాంపూర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కంటే విద్యాదానం గొప్పదని మండల విద్యాధికారి సిరిమల్లె మహేష్ అన్నారు. గురువారం ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం చేపట్టారు. బడి బయట ఉన్న పిల్లల తల్లితండ్రుల వద్దకు వెళ్లి విద్యా ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పోషణతో కూడిన ఆహారం, దుస్తులు తదితర సౌకర్యాలపై వివరించారు. హెచ్‌ఎం నరెడ్ల సునీత, సీఆర్‌పీలు కుంట కుమారస్వామి, కుర్మశెట్టి చందర్, ఉయ్యాల వీరయ్య, చంద్రకళ, పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చర్యలు

ఎలిగేడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. వరద నీరు ఇళ్లలోకి వచ్చే పరిస్థితి నెలకొనడంతో అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం నారాయణపల్లిలో వర్షం నీరు ఎగువ ప్రాంతం నుంచి రావడంతో పలువురి ఇండ్లలోకి చేరాయి. కాలనీ వాసులు కార్యదర్శి సాదుల పాపన్నకు తెలుపడంతో ఆయన స్పందించి ఎక్స్‌కావేటర్‌తో కాలువలో ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగింపజేశారు.

అర్చకులకు ప్రశంస పత్రాలు

రామగిరి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తు హైదరాబాద్ సార్వత్రిక పరిషత్ భవన్‌లో డిడిఎన్ అర్చక సంఘం పిలుపు మేరకు రామగిరి, ముత్తారం మండలానికి చెందిన అర్చకులు యాగ కృతువులో పాల్గొన్నారు. మహాచండి, కుబేర పాశుపత యాగంలో పాల్గొన్న కొటగడ్డల శివచందర్‌శర్మ, పనకంటి సంతోష్‌శర్మ, సౌమిత్రి కృష్ణమాచార్యులు, ఆచార్యులు విష్ణు శర్మలకు రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌మూర్తి చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందుకున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మిక మంత్రి వివేక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, జూలై 24(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో దాదాపు 30వేలకు పైగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అధ్యక్షకార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్‌లు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్‌కు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్టు ఆ యూనియన్ ఆర్‌జీ-1 అధ్యక్షుడు ఎంఏ గౌస్ తెలిపారు. సింగరేణిలో ఏఐటీయూసీ గెలిచిన తరువాత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇచ్చిన హామీ మేరకు సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి వివేక్‌ను కోరినట్టు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత సమస్యలపై నాయకులు మంత్రితో చర్చించినట్టు, సింగరేణి అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు అమలు చేయాలని, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, నిరుద్యోగులకు, నిర్వాసితులకు సింగరేణి ప్రైవేట్ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. మంత్రి వివేక్ స్పందించి సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులకు హామీ ఇచ్చారని గౌస్ పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, నాయకులు ఎండీ అక్బర్ ఆలీ, యర్రగాని కృష్ణయ్య, అఫ్రోజ్‌ఖాన్, కేడబ్బ్యు క్రిస్టోఫర్, కే ప్రభాకర్, జెట్టి మల్లయ్య పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

సుందిళ్ళ లీజు భూముల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు

గోదావరిఖని, జూలై 24(ఆంధ్రజ్యోతి): సుందిళ్ళలో సింగరేణి మైనింగ్ లీజు భూములకు సంబంధించిన ఎక్స్‌గ్రేషియా చెక్కులను గురువారం ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ రైతులకు అందజేశారు. జీఎం మాట్లాడుతూ ఓసీపీ-5 పరిధిలోని సింగరేణి మైనింగ్ లీజు భూములలో సుందిళ్ళ రైతులు సింగరేణి భూమిని తాత్కాలికంగా కొంతకాలం జీవనోపాధికి ఉపయోగించుకున్నారని, ఇప్పుడు ఆ భూమిలో ఓసీపీ పనులు చేపడుతున్న సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, కోయ శ్రీహర్ష, సింగరేణి సీఎండీ, డైరెక్టర్(పా) ఆదేశానుసారం, ఎకరానికి రూ.6.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశామన్నారు. ఈడీసీ కమిటి అధికారులు, ఎస్ఓటూ జీఎం ఆంజనేయ ప్రసాద్, ప్రాజెక్ట్ అధికారి డీ రమేష్, డీజీఎం(సర్వే) జీఎల్ రాజు, డీజీఎం(ఫైనాన్స్) ధనలక్ష్మి బాయి, ఎస్టేట్ అధికారి సాంబశివరావు, లా ఆఫీసర్ అఫ్రిన్ సుల్తానా పాల్గొన్నారు.



రైతులకు చెక్కులను అందజేస్తున్న జీఎం లలిత్ కుమార్